రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించండి

- కేసముద్రంను కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తాం...
- రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి
- ఉప్పరపల్లి సబ్ స్టేషన్, కస్తూరిబా నూతన భవనం ప్రారంభం...



కేసముద్రం అక్టోబర్ 26(ప్రభాత గమనం):

రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు ప్రాంతాభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని, కేసముద్రంను కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ పర్యటనలో భాగంగా వేం నరేందర్ రెడ్డి మండలంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉప్పరపల్లి గ్రామంలో రూ. 3 కోట్ల 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని (సబ్ స్టేషన్) ఆయన ప్రారంభించారు. అదేవిధంగా మహమూద్‌పట్నం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 3 కోట్ల 20 లక్షలతో నిర్మించిన నూతన అధునాతన భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఉప్పరపల్లిలో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రం రాకతో ఉప్పరపల్లి, అర్పణపల్లి, వెంకటగిరి, ఇంటికన్నె, కాట్రపల్లితో పాటు కొత్త చెరువు తండా, ముత్యాలమ్మ తండా, చంద్రు తండా పరిధిలో లో-వోల్టేజ్ సమస్య శాశ్వతంగా తీరిపోతుందన్నారు. వినియోగదారులకు, వ్యవసాయ రంగానికి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు.ఆడబిడ్డల చదువు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కస్తూరిబా పాఠశాల నూతన భవనంతో విద్యార్థినులకు సురక్షితమైన, మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. భవన ప్రారంభం అనంతరం తరగతి గదులను, వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థినులతో స్వయంగా ముచ్చటించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోడ్పాటుతో, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ల సహకారంతో కేసముద్రం పరిధిలో రూ. వందల కోట్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కేసముద్రంను రాష్ట్రంలోనే ఒక 'మోడల్ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. తాను ఈ ప్రాంతంలోనే అందరితో కలిసి పెరిగానని, ఇక్కడి ప్రజలు తనపై చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతగా మండల రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళీ నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ శబరీష్,మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీఏ జిల్లా సభ్యులు రావుల మురళి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్, మున్సిపల్ చైర్ పర్సన్ భానోత్ సునీత, వైస్ చైర్ పర్సన్ అల్లం రమా, నాయకులు బండారు వెంకన్న, బండారు దయాకర్, సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ టీవీల పంపిణీ...

- చేతన ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం....
- సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి....

కేసముద్రం అక్టోబర్ 26(ప్రభాత గమనం):

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ ఇన్ఫోసిస్టమ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు 10 డిజిటల్ టీవీలను పంపిణీ చేశారు. మంగళవారం కేసముద్రం మండలం ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డిజిటల్ టీవీలను అందజేశారు.ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ విద్యను అందించడంలో డిజిటల్ టీవీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తుకు చేతన ఫౌండేషన్ ముందుకొచ్చి ఇలాంటి పంపిణీ కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో చేతన ఫౌండేషన్ సమాజ హితం కోసం మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, తాతా గణేష్, పాఠశాల హెచ్ఎం కాట్రగడ్డ చంద్రశేఖర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

